

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

## మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించండి

**ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**

ఆర్మూర్, నవంబర్26: బీఆర్ఎస్‌ను ఆదరించి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఆయన నివాసానికి ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం చేరుకొని జీవన్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి వారితో సమావేశమయ్యారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తానని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో ఆర్మూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని జీవన్‌రెడ్డి కోరారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డిని ఆశీర్వదించండి



పట్టణంలోని 2వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీవన్ సతీమణి రజితారెడ్డి

**ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి**

ఆర్మూర్‌టౌన్, నవంబర్26: కారుగుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి కోరారు. ఆర్మూర్ పట్టణంలోని 2వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ ఖాందేశ్ సంగీతతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రజితారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వాతిసింగ్ బబ్లూ, ఖాందేశ్ సత్యం, విఠోబా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

శక్కర్‌నగర్, నవంబర్ 26: బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరంలో కార్తికమాసోత్సవంలో భాగంగా ఆదివారం కార్తిక పౌర్ణిమను పురస్కరించుకుని దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు గణేశ్ శర్మ, మహేశ్ పాఠక్ మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లక్షదీపార్చనలో భాగంగా దీపాన్ని ఆలయ ఈవో శ్రీరాం రవీందర్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, ధర్మకర్తలు సతీసమేతంగా వెలిగించారు. ఆలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి అలంకరించారు.

### మారుతీ మందిరంలో..

బోధన్ పట్టణంలోని మారుతీ మందిరంలో ఆలయ అర్చకుడు ప్రవీణ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు లింగాకృతి, ఓం కారం ఆకృతిలో దీపాలను వెలిగించారు.

### కందకుర్తి వద్ద పుణ్య స్నానాలు

రెంజల్, నవంబర్ 26: మండలంలోని కందకుర్తిలోని పవిత్ర గోదావరి నదిలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నెలరోజుల పాటు కార్తిక పూజలు చేసిన భక్తులు, పౌర్ణమి రోజు నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం నదీ తీరాన ఉన్న శివాలయం, పక్కనే ఉన్న సీతారాం త్యాగి మహరాజ్ నిర్మించిన శనీశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.



బోధన్ పట్టణంలోని మారుతీ మందిరం వద్ద లింగాకృతిలో దీపాలు



కందకుర్తి గోదావరి తీరాన ఉన్న శివాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బోధన్ చక్రేశ్వర శివమందిరంలో దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు




ప్రశంసాపత్రాలను అందుకుంటున్న శ్రీనివాస్

### యోగాలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం

నవీపేట, నవంబర్ 26: హైదరాబాద్‌లో వసంత్ యోగా అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించిన యోగాలో భాగంగా 28 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నవీపేటకు చెందిన హరన్ శ్రీనివాస్ స్థానం సాధించాడు. దయానంద్ యోగా కేంద్రానికి చెందిన యోగా రాంచందర్ గురూజీ వద్ద శ్రీనివాస్ శిష్యుడిగా ఉన్నారు. శ్రీనివాస్‌కు వసంత్ యోగా అకాడమీ సంస్థ జడ్జిలు ప్రశంస పత్రాన్ని అందజేశారు. గతంలో 36 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసిన రికార్డ్‌ను తాను బద్దలు కొట్టినట్లు శ్రీనివాస్ చెప్పారు.

### ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఒకరి మృతి

నవీపేట, నవంబర్ 26: మండలంలోని ధర్మారాం చెరువు కట్టపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నిజామాబాద్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కోటగిరి గంగాధర్(45) ఈ నెల 25న నవీపేట మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామానికి కూతురును చూసి వెళ్దామని భార్యతో కలిసి వచ్చాడు. భార్య స్వగ్రామానికి వెళ్లగా అల్లుడు పొలం కోయడంతో వడ్లను తీసుకు రావడానికి అల్లుడు రమణతో కలిసి ట్రాక్టర్‌లో బయల్దేరారు. ధర్మారాం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ విఠల్ అతివేగంగా నడపడంతో చెరువు కట్టమీద ట్రాక్టర్ ట్రాలీ నుంచి ఎగిరి టైర్ కింద పడ్డారు. తల నుజ్జునుజ్జు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. గంగాధర్‌కు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.